క్లుప్తంగా

శిథిల నిర్మాణాల తొలగింపునకు 28న వేలం

భీమునిపట్నం: భీమిలిలోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాల వద్ద శిథిలమైన నిర్మాణాలను తొలగించడానికి ఈ నెల 28న వేలం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జయప్రకాశరావు సోమవారం తెలిపారు. ఇక్కడ హాస్టల్ వద్దనున్న డైనింగ్ హాలు, వంట గది, స్టోర్‌రూమ్ మొదలైనవి పూర్తిగా శిథిలమైపోయాయని, ఇవి విద్యార్థినుల భద్రతకు ముప్పు వాటిల్లే విధంగా మారాయని పేర్కొన్నారు. అధికారుల ఆదేశాల మేరకు వీటిని తొలగించడానికి ఈ నెల 28న ఉదయం 11గంటలకు పాఠశాల ఆవరణలో వేలం నిర్వహిస్తారని, ఆసక్తి గలవారు ఇందులో పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాలకు 8712625025, 8309519107 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

యాతవాని చెరువు అన్యాక్రాంతంపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు ఇస్తున్న రైతులు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో సర్వే నంబర్ 73/2లోని యాతవాని చెరువు అన్యాక్రాంతంపై ఆయకట్టు రైతులు తహసీల్దార్ కె.ఆనందరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు. 2009 నుంచి ఈ చెరువులో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయని, చెరువుకు రక్షణ గోడ నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈ చెరువు గర్భాన్ని కొంతమంది అన్యాక్రాంతం చేయగా.. భీమునిపట్నం ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతో వారు చెరువు వద్దకు రావడం మానేశారన్నారు. మళ్లీ వారం రోజుల క్రితం వేరొక వ్యక్తి చంబేటి ధనరావు వచ్చి చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు నిలిపి వేశారని ఆ ఫిర్యాదులో తెలిపారు. దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని రేవిడి, వెంకటాపురం పంచాయతీ రైతులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులతో పాటు రేవిడి ఎంపీటీసీ సూరప్పడు, మాజీ ఎంపీటీసీ ఆవాల గంగరాజు, వెంకటాపురం సర్పంచ్ కర్రి రమణ, మరగడ అప్పారావు ఉన్నారు.

రౌడీమూకల దాడిపై కేసు



బీరు బాటిల్స్ విసురుతున్న రౌడీ మూకలు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీ శాంతి ఆశ్రమం భూముల్లో రౌడీ మూకల దాడికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. కొన్నేళ్లుగా అక్రమంగా వినియోగించుకుంటున్న కొందరు గత నెలలో ఆ భూములను శాంతి ఆశ్రమానికి అప్పగించారు. సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత ఆశ్రమం యాజమాన్యం భూమిని దక్కించుకున్నప్పటికీ, ఆక్రమణదారుల ఆగడాలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఆ భూముల్లో పనిచేస్తున్న ఆశ్రమానికి చెందిన వారిపై ఆక్రమణదారుడు సిద్ధార్థ్ పంపిన రౌడీ మూకలు రాళ్లు, బీర్ బాటిళ్లతో దాడి చేశారు. జాలరిపేట శ్మశానవాటిక రోడ్డు వైపు నుంచి ఆశ్రమానికి అప్పగించిన భూముల్లో పనులు చేస్తున్న వారిపై దాడి చేస్తున్న వీడియో వైరల్ అయింది. ఈ ఘటనపై ఆశ్రమం ప్రతినిధులు ఈ నెల 15న ఫిర్యాదు చేయగా, ఎంవీపీ పోలీసులు సిద్ధార్థ్‌తో పాటు రౌడీ మూకలపై కేసు నమోదు చేశారు. వీడియోలో ఉన్నవారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చరిత్రకు ఆనవాళ్లు

సంస్థానాధీశులు, ఆంగ్లేయుల పాలనకు సాక్ష్యాలు



ప్రస్తుతం నీళ్లకుండీల జంక్షన్

నీళ్ల కుండీల జంక్షన్.. బంగ్లామెట్ట .. భీమిలి పరిసర ప్రాంత వాసుల నోళ్లలో నిత్యం నానుతూనే ఉంటాయి. వినడానికి కాస్త కొత్తగా ఉన్న వీటి గురించి తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందిలో ఉంటుంది. ప్రస్తుతం ఇవి ప్రధాన సెంటర్లుగా పేరుగాంచినా, అసలు వాటికి ఆ పేరు ఎందుకొచ్చిందనేది బయటివారికే కాదు, స్థానికులకు కూడా అంతగా తెలియదు. వాస్తవానికి ఈ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది. గత రాజుల, బ్రిటీష్ పాలనకు సాక్ష్యాలుగా ఇవి నిలిచాయి.

– తగరపువలస

అలా.. 'నీళ్లకుండీలు' జంక్షన్‌గా..



తుప్పలతో నిండిన నీళ్లకుండీలు



ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీలో నీళ్లకుండీలు



నీళ్ల కుండీల నుంచి నీటి సరఫరాకు పైపులు బిగించిన ఆనవాళ్లు

ఆనందపురం–పెందుర్తి జాతీయ రహదారిపై నీళ్ల కుండీల జంక్షన్ ఉంది. ఇక్కడ గిడిజాల పంచాయతీ సర్వే నంబర్ 332/2లో 8 ఎకరాల 27 సెంట్లలో నీళ్ల కుండీలు ఉన్నాయి. గతంలో విజయనగరం వైపు సంస్థానాలు, బ్రిటీషర్ల పాలనలో ఉద్యోగులు సింహాచలం, నర్సీపట్నం, ఎలమంచిలి తదితర ప్రాంతాలకు పన్నుల వసూళ్లకు గుర్రాలపై వెళ్లేవారు. వారు నీళ్లకుండీల వద్ద ఆగి, గుర్రాలకు నీరు తాగించేవారని, వాటి అవసరాలకే ఈ కుండీలను నిర్మించారని పూర్వీకులు చెబుతారు. గానుగ సున్నం, ఇటుకలు, రాళ్లతో చుట్టూ ప్రహరీ, నీళ్ల దాచుకునేందుకు పదుల సంఖ్యలో కుండీలు ఇందులో నిర్మించారు. బయట నుంచి కుండీలను నింపడానికి, లోపల నీరు బయటకు పంపడానికి నిర్మించిన పైపుల ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. అలాగే బ్రిటీష్ పాలకులు ఈ కుండీలను నీలిమందు తయారీకి వినియోగించి, భీమిలి పోర్టు మీదుగా ఎగుమతులు చేసినట్టు కూడా తెలుస్తుంది. ప్రస్తుతం తుప్పలతో బయట ప్రపంచానికి కనిపించకుండా ఉన్న ఈ నీళ్ల కుండీలు, లోపల విషపురుగులతో నిండిపోయాయి. ఇదే సర్వే నంబర్‌లో కొంత భాగం ఎన్టీఆర్ కాలనీకి ఇవ్వగా మిగిలిన స్థలంలో రెవెన్యూ అధికారులు పూర్వమే మరికొందరికి పట్టాలు ఇచ్చారు. ఇటీవల నీళ్లకుండీల ఆనవాళ్లు ఉన్న ప్రాంతాలను కూడా కబ్జాకు ప్రయత్నించడంతో రెవెన్యూ అధికారులు కూల్చేశారు.

మెట్టపై విశ్రాంతి బంగ్లా ..'బంగ్లామెట్ట'



జీవీఎంసీ ఒకటో వార్డు మెట్టపై శిథిలమైన బంగ్లా

నీళ్ల కుండీలు నిర్మించిన కాలంలోనే తగరపువలస మీదుగా విశాఖ వైపు వెళ్లే సంస్థానాధీశులు, బ్రిటీష్ పాలకుల విశ్రాంతి కోసం గోస్తనీనది దాటిన తరువాత మెట్టపై విశ్రాంతి భవనం నిర్మించారు. అక్కడే తమ వాహనాలు, గుర్రపు బగ్గీలు నిలిపి ఉంచేవారు. మెట్టపై నిర్మించిన విశ్రాంతి భవనం కాస్తా ప్రస్తుతం బంగ్లామెట్టగా మారిపోయింది. తరువాత కాలంలో ఈ విశ్రాంతి భవనం ఆర్ అండ్ బీ శాఖ ఆధీనంలో ఉండేది. ఇటీవల వరకు దీనికి మరమ్మతులు చేయిస్తూ వచ్చినా ప్రస్తుతం దీని నిర్వహణను వదిలేశారు. దీంతో ఎలాంటి వసతి లేని మూడు కుటుంబాలు దీనిని ఆవాసంగా మార్చుకున్నాయి. 1974లో గోస్తనీనదిపై వంతెన నిర్మించినప్పుడు బంగ్లామెట్ట, వెంకటేశ్వరమెట్టగా విడిపోయి, మధ్య నుంచి జాతీయ రహదారిని నిర్మించారు. 25 ఏళ్ల క్రితం వరకు ఖాళీగా ఉన్న ఈ బంగ్లామెట్టపై బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో ఇదో ప్రధాన గ్రామంగా మారిపోయింది. ఈ బంగ్లామెట్ట గ్రామం నుంచి జీవీఎంసీ ఒకటోవార్డు ప్రారంభం అవుతుంది. ఇటీవల వర్షాలకు జాతీయ రహదారి వైపు బంగ్లామెట్ట నుంచి రాళ్లు, గ్రావెల్ జారిపడుతూ ముప్పు పొంచి ఉంది. ఈ విశ్రాంతి భవనాన్ని కూల్చివేసి అక్కడ కల్యాణమండపం నిర్మించాలని బంగ్లామెట్ట వాసులు కోరుతున్నారు.

నేటి తరానికి తెలియజేయాలి



బంగ్లామెట్ట, నీళ్ల కుండీల చరిత్రను ఇప్పటి తరాల వారికి తెలియజేయాలి. కచ్చితంగా ఎప్పుడు నిర్మించారు? ఎవరి హయాంలో నిర్మించారో బోర్డులు పెట్టాలి. లేదంటే తెలిసీ తెలియని వారు ఒక్కోరకంగా చెబుతున్నారు. నీళ్లకుండీల వద్ద తుప్పలు తొలగించి, బంగ్లామెట్ట విశ్రాంతి భవనం ఆక్రమణలు జరగకుండా చూడాలి.

– శీరపు అప్పలరెడ్డి, సంగివలస

కాలగర్భంలో కలవనీయొద్దు



స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన వీటిని కాలగర్భంలో కలసిపోకుండా ప్రభుత్వం పరిరక్షించాలి. వందేళ్లు దాటిన ఇలాంటి వారసత్వ నిర్మాణాలు కాపాడుకోవాలి. ఇప్పటికే వీటి గురించి ఎవరికి సరిగా తెలియడం లేదు. విశాఖ కంటే వందల ఏళ్ల ముందు ఏర్పడిన భీమిలి చరిత్రే మరుగున పడింది. ఈ ప్రాంత ప్రాశస్త్యాన్ని మరుగున పడనీయవద్దు.

– కొయ్య అప్పల సూర్యనారాయణరెడ్డి, మూలకుద్దు

ఈ ప్రాంత విశిష్టత అందరికీ తెలియాలి



బంగ్లామెట్ట, నీళ్లకుండీల గురించి ముందుగా స్థానికులకు తెలియాలి. అప్పుడే బయటవారికి తెలియజేయగలరు. చిన్నవో పెద్దవో చారిత్రక నిర్మాణాలు ఉన్నప్పుడు వాటిని మనం గుర్తుంచుకోవాలి. పలువురికి తెలియజేయాలి. అప్పుడే ఈ ప్రాంతానికి ఉన్న విశిష్టత అందరికీ తెలుస్తుంది. అలా తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉంది.

– పెనుమాక జాన్ చార్లెస్, చిట్టివలస

అమ్మవార్ల అనుపోత్సవాలు నేడు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ యాతపేట గ్రామదేవతల ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బంగారమ్మ, అసిరితల్లి, యామాలమ్మలకు అనుపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆనందపురం మండలం శొంఠ్యాంలోనూ ముత్యాలమ్మ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. జీవీఎంసీ 2వ వార్డు చిట్టివలస, చిల్లపేట, జీరుపేట తదితర 9 గ్రామాల ప్రజలు మంగళవారం పోలమ్మతల్లికి పసుపు, కుంకుమలు సమర్పించనున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తగరపువలస: ఆనందపురం మండలం 11 కేవీ బాకూరుపాలెం, ఐటీబీపీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా మండలంలోని లొడగలవానిపాలెం, సీతంపాలెం, జగ్గరాజుపాలెం, పందలపాక, బాకూరుపాలెం, ఇచ్ఛాపురం, గొంపవానిపాలెం, చిన్నయ్యపాలెం, రామునాయనిపేట, రేగానిగూడెం, ముకుందపురం కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పేర్లలో తప్పులుంటే సరిచేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: రీ సర్వేలో భాగంగా గ్రామ కంఠంలో ఇళ్లు కట్టుకున్నట్లు గుర్తించిన పట్టా లబ్ధిదారులు తమ పేర్లలో తప్పులుంటే సరి చేసుకోవాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ సూచించారు. మండలంలోని రేవిడిలో సోమవారం నిర్వహించిన స్వామిత్వ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రీసర్వేలో గుర్తించిన గ్రామ కంఠం ఇళ్ల లబ్ధిదారుల పేర్లలో తప్పులుంటే సంబంధిత పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ కంఠం ఇళ్ల పట్టా లబ్ధిదారుల జాబితాను సభలో ప్రకటించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మీనా కుమారి, ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు పుచ్చలపల్లి



చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి కూడలి వద్ద పుచ్చలపల్లికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్మికులు

మధురవాడ: కార్మిక, శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం ఆఖరి శ్వాస వరకు పనిచేసిన భారత పార్లమెంట్ మొదటి ప్రతిపక్ష నేత పుచ్చపల్లి సుందరయ్య నేటి తరానికి ఆదర్శమని పలువురు నాయకులు, కార్మికులు కొనియాడారు. ఆయన 40వ వర్ధంతిని పురస్కరించుకుని పీఎం పాలెం, బింద్రానగర్, మధురవాడ పరిసర ప్రాంతాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిపక్ష నేతగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీఐటీయూ నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ నిబద్ధత, విలువలతో కూడిన ఆదర్శమైన నాయకుడన్నారు. తాను భూస్వామి అయినా పేద ప్రజల కోసం, కార్మికోద్యమం కోసం తన యావదాస్తిని ధారపోశారన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.రాజ్‌కుమార్, ఆర్.బాబూరావు, అప్పలరెడ్డి, రామసుబ్బయ్య, గాంధీ, కొండమ్మ, శేషు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నివాళులు

తగరపువలస: కమ్యూనిస్టు ఉద్యమనేత, స్వాతంత్ర సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు సోమవారం నివాళులు అర్పించారు. ప్రైవేట్ మార్కెట్, చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి, యాతపేటలలో ఏర్పాటు చేసిన చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఆయన నిరాడంబరత, నిస్వార్థ సేవాభావం గురించి కొనియాడారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో జోన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ, రీసు నరసింగరావు, చిన్నారావు, కొత్తయ్య రెడ్డి, నీలాతి రాము, పల్ల పెంటరాజు తదితరులున్నారు.

తెలుగు యువత సమర్పించు.. అశ్లీల నృత్యాలు



మద్ది శివారులో శనివారం అర్ధరాత్రి ప్రదర్శించిన అశ్లీలనృత్యాలు

తగరపువలస: పద్మనాభం మండల తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల వెంకట సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు శనివారం రాత్రి మద్ది శివారులో అశ్లీల నృత్యాలతో జరుపుకోవడం సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోమవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనపై వీటిని ఏర్పాటు చేసిన కాళ్ల వెంకట సత్యనారాయణతో పాటు ఆనందపురం మండలం శిర్లపాలేనికి చెందిన కోరాడ గౌరినాయుడుపై పద్మనాభం సీఐ శ్రీధర్ కేసులు నమోదు చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బయట నుంచి తీసుకు వచ్చిన ఇద్దరు యువతులతో పాటు పదుల సంఖ్యలో నిందితులు, వారి స్నేహితులు సినిమాల్లోని ఐటెం పాటలకు తెల్లవార్లూ చిందులు వేసినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా నిందితుల తరఫున పాల్గొన్న యువకులు మాట్లాడుతూ సత్యనారాయణ అంటే గిట్టని మద్దికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడే తన అనుచరులతో వీడియోలు తీయించి బహిర్గతం చేశారని మండిపడుతున్నారు.

బోరవానిపాలెంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయం ఎదుట పత్రాలు చూపుతున్న పట్నాల రమాదేవి, వెంకటేశ్వరరావు

మహారాణిపేట: బోరవానిపాలెం గ్రామంలో గెడ్డను ఆనుకొని ఉన్న సర్వే నం.101లో అక్రమ కట్టడాలపై దర్యాప్తు చేయాలని గ్రామస్తురాలు పట్నాల రమాదేవి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు తెడ్డు వెంకటేశ్వరరావుతో కలసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం, అంగన్‌వాడీ భవనం, స్కూల్ భవనాలను ఆనుకొని ఉన్న కొన్ని స్థలాలను కొందరు పెద్ద మనుషుల ముసుగులో ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కట్టడాల కోసం ప్రస్తావించిన వారిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో పెద్దమనిషిగా ఉన్న ఒక వ్యక్తి అక్కడి ప్రభుత్వ స్థలాలను అమ్ముతూ డబ్బులు చేసుకుంటున్నారని, వీరికి కొంతమంది రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని వెంకటేశ్వరరావు అన్నారు. గతంలోనూ దీనిపై ఫిర్యాదు చేశామని, కొందరు రెవెన్యూ అధికారులు సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారని రమాదేవి ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

దుర్గాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో మొకర వారి ఇలవేల్పు దుర్గాలమ్మ ఉత్సవాలు సోమవారం తొలేళ్లతో ప్రారంభమయ్యాయి. మంగళవారం రథాల ఉత్సవం నిర్వహిస్తారు. బుధవారం ముగింపు ఉత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జీవీఎంసీ.. అన్నింటా నిర్లక్ష్యమే



మారికవలస ఆర్‌జీకే కాలనీ హైవేలో విరిగిపోయిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభం



దంపింగ్‌యార్డు జంక్షన్ వద్ద హైవేలో విరిగిపోయిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభం



బోయిపాలెం సిగ్నల్ వద్ద ఒరిగిన సిగ్నల్ పోల్స్

మధురవాడ: జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో వీధి లైట్లు, విద్యుత్ స్తంభాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటోంది. జీవీఎంసీ మధురవాడ జోన్‌లో క్రికెట్ స్టేడియం మొదలుకుని బోయిపాలెం సిగ్నల్ వరకు ఉన్న సెంట్రల్ లైటింగ్, సిగ్నల్స్ వద్ద పోల్స్ నిర్వహణ సరిగ్గా లేదు. మధురవాడ, మారికవలస, పరదేశిపాలెం, బోయిపాలెం పరిసర ప్రాంతాలలో అరడజను వరకు సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. నెలలు గడుస్తున్నా వీటిని పట్టించుకునే వారు లేకపోయారు. సిగ్నల్స్ నిర్వహణ కోసం పోలీసులు లెటర్లు రాస్తున్నా.. వీరికి చీమకుట్టినట్టు అయినా లేదు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 35 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ కనకమహాలక్ష్మి



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు ఇవ్వడానికి జోన్-2 కార్యాలయం వద్ద ఎండలో వేచి ఉన్న ప్రజలు

మధురవాడ: జీవీఎంసీ జోన్-2లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు రికార్డు స్థాయిలో 35 అర్జీలు వచ్చాయి. జెడ్సీ కనకమహాలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో టౌన్‌ప్లానింగ్‌కు 12, ఈఈ వర్క్స్ విభాగానికి 9, వాటర్ సప్లైకి 2, రెవెన్యూకు 3, పబ్లిక్ హెల్త్‌కు 4, ఎలక్ట్రికల్‌కు 5, యూసీడీకి ఒకటి చొప్పున 36 సమస్యలపై 35 అర్జీలు వచ్చినట్లు జెడ్సీ తెలిపారు. ఎండాడ శ్రీనివాసనగర్ సర్వే నం.10, 11లలో రోడ్డు ఆక్రమణల తొలగింపు, 6వ వార్డు పీఎం పాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో బ్లాక్ నెంబర్ 4, 6, 7 మధ్య–1, 2, 3 మధ్య కొత్త బోర్ల ఏర్పాటు, 8వ వార్డు ఎండాడ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ వద్ద లైట్లు వెలగక అంధకారం తదితర సమస్యలకు సంబంధించి వినతులు సమర్పించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జోన్–1 పీజీఆర్ఎస్‌కు ఐదు ..

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఐదు వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించినవి నాలుగు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఒక వినతి ఉన్నాయి. వీటిని పరిశీలించి, త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు.

రియల్టర్లు.. రెచ్చిపోతున్నారు



శొంఠ్యాంలో ఆక్రమణకు గురైన ఎర్రా వారి శ్మశానవాటిక

- కొండలను తవ్వి గ్రావెల్ తరలింపు
- బంజరు భూములు, శ్మశానవాటికల ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు



శొంఠ్యాంలో తవ్విన కొండవాలు ప్రాంతం



జగ్గరాజుపాలెంలో గ్రావెల్ కోసం తవ్విన కొండ ప్రాంతం



శొంఠ్యాంలో పెద్ద చెరువు కింద పాత చెరువులో గ్రావెల్ కోసం తవ్విన గోతులు

తగరపువలస: ఆనందపురం మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు.. కనిపించిన కొండలను తవ్వి గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. బంజరులు, శ్మశానవాటికలు అవసరమైతే రైతులను బెదిరించి జిరాయితీ భూములను కూడా కలిపేసుకుంటున్నారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్నారనే విమర్శలున్నాయి.

ఇటీవల మండలంలోని శొంఠ్యాం పంచాయతీలో బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు కొండవాలు ప్రాంతంలో సర్వే నంబర్ 347లో పెద్ద చెరువు కింద పాత చెరువు నుంచి నిరంతరాయంగా వెయ్యి లోడ్లకు పైగా గ్రావెల్‌ను తరలించి ప్రభుత్వ భూములు, శ్మశానవాటికలను కప్పేసి ఆక్రమించుకున్నాడు. పంచాయతీలో నిరక్షరాస్యులైన పలువురు రైతులను కూడా బెదిరించి జిరాయితీ స్థలాలు కలిపేసుకున్నట్టు ఇతనిపై ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగా 15 అడుగుల గెడ్డలు మాయమయ్యాయి. ఈ క్రమంలో బొద్దపు, లెంక, కోరుకొండ, బ్రాహ్మణ, ఎర్రా వారి శ్మశానవాటికలను ఆక్రమించడంతో పాటు వాటిలోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా చేశాడని పంచాయతీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇంకా సర్వే నంబర్ 190, 192, 147, 148లో కూడా భారీగా ఆక్రమణలకు పాల్పడినట్టు పంచాయతీ వాసులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బయటకు రాని ఇక్కడి బడా ఎస్టేట్ వ్యాపారి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెలరేగిపోతున్నారు. కొండలు తవ్వి గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు.

- చందక పంచాయతీ జగ్గరాజుపాలెంలో జగనన్న కాలనీని ఆనుకుని ఉన్న కొండను రాత్రివేళ అక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు యంత్రాలతో తవ్వి తీసుకుపోతున్నారు. దీని కోసం కొండ వద్దకు వాహనాలు వెళ్లేందుకు ప్రత్యేకమార్గాలు నిర్మించుకున్నారు.

తరలింపు వాస్తవమే: వీఆర్వో

శొంఠ్యాం పంచాయతీలో గ్రావెల్ అక్రమ దందా గురించి స్థానిక వీఆర్వో ప్రియానంద్ వద్ద ప్రస్తావించగా గ్రావెల్ తరలించిన మాట వాస్తవమే. కానీ రాత్రి వేళ కాపలా కాయడం తమ పని కాదన్నారు. గ్రావెల్ తవ్వకాలు, బంజరు ఆక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి తహసీల్దార్ దృష్టిలో పెట్టినట్టు తెలిపారు.

యాతవాని చెరువు పరిశీలన

పద్మనాభం: మండలంలోని రేవిడిలో యాతవాని చెరువులో ఉపాధి హామీ పథకం పనులను చేయనీయకుండా ఒక వ్యక్తి నిలిపివేశారని గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు.